కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై అవిశ్రాంత పోరు



మణికొండలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యంగా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క పథకాన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మణికొండ మర్రిచెట్టు సర్కిల్ నుంచి బైక్ ర్యాలీని నిర్వహించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ... రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని సగం మందికే చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇంటి స్థలాలు సంవత్సరం దాటినా ప్రజలకు అందలేదన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని పాత నోటిఫికేషన్‌లోనివే 50 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. రైతు భరోసా, పెంచి ఇస్తామని పింఛన్‌లు ఇప్పటి వరకు ప్రజలకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా హామీలను అమలు చేసేంతవరకు ప్రభుత్వంపై బీజేపీ అవిశ్రాంత పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, మహాలింగంగౌడ్, రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు మహేందర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వై. శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్ యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, మున్సిపాలిటీల అధ్యక్షులు సి.బీరప్ప, సి.హెచ్.భిక్షపతి యాదవ్, మహేష్ యాదవ్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూమి తీసుకోవద్దు: సీపీఎం



భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మణికొండ: గతంలో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ పాలనలో రాష్ట్రంలో దళితులకు కేటాయించిన అసైన్డ్ భూమిని ప్రస్తుతం ఇందిరమ్మ పాలనను అందిస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ పాలకులు దళితుల నుంచి ఆ భూమిని లాక్కోవాలనుకోవటం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి రుద్రకుమార్, కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు గండిపేట మండలం వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 132లోని 52 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అప్పట్లో ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ అసైన్డ్ పట్టాలను కేటాయించిందని గుర్తు చేశారు. అలాంటి భూమిలో ఇప్పటి వరకు వారు సాగు చేసుకుని జీవిస్తున్నారన్నారు. ఎలాంటి అమ్మకాలు చేయకపోయినా సదరు భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని చూడటం మంచి పద్ధతి కాదన్నారు. అభివృద్ధి పేరుతో దళితుల భూమిని తీసుకోవాలని చూస్తే వారందరినీ ఏకం చేసి పోరాటం చేస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ నిర్మించాలని సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: పుప్పాలగూడలో మంజూరైన అంబేడ్కర్ భవనాన్ని వెంటనే నిర్మించటంతో పాటు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. పుప్పాలగూడ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చేసిన శంకుస్థాపన ఫలకం వద్ద బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి మంజూరైన నిధులను మళ్లించి పనులను పక్కన పెట్టడం భావ్యం కాదన్నారు. అంబేడ్కర్ భవన్ నిర్మించాలని పాదచారులు, వాహనదారులు, స్థానికులతో సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, విఠల్, ప్రకాశ్, ఎ.లక్ష్మణ్‌రావు, ఎస్.శ్రీకాంత్, ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎంలో న్యాయపరమైన విధులపై సదస్సు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది రాజేశ్వర్‌రావు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఐసీఎంలో చట్టబద్ధమైన పాక్షిక న్యాయపరమైన విధులపై ఒక రోజు సదస్సు బుధవారం జరిగింది. ఈ సదస్సును హైకోర్టు సీనియర్ న్యాయవాది రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఇందులో లీగల్ శిక్షణలు, ప్రత్యేక లీగల్ సెల్స్, రికార్డులను బలోపేతం చేయడం, డాక్యుమెంటేషన్, సమయ పాలనకు కట్టుబడి ఉండటం, సమీక్షలు, జవాబుదారీ విధానం వంటి అంశాలు, ఎలా పటిష్టం చేయాలని వక్తలు సూచించారు. వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్ర హైకోర్టుకు సంబంధించిన న్యాయవాదులు, రిటైర్డ్ న్యాయమూర్తులు పాల్గొన్నారన్నారు. సహకార చట్టం, న్యాయ పరమైన చర్చలు జరిగినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై న్యాయపరమైన పరిష్కార మార్గాలను న్యాయవాదులు వివరించారని తెలిపారు. కో ఆపరేటివ్ సొసైటీస్ అడిషనల్ రిజిస్ట్రార్ జి.శ్రీనివారావు మాట్లాడుతూ... సహకార సంఘాల పటిష్టతలో సుపరిపాలన జవాబుదారీతనం కీలకమన్నారు. ముఖ్యంగా చట్టబద్ధమైన, పాక్షిక న్యాయపరమైన విధులలో పూర్తి అవగాహన, అధికారులు సమర్థత చాలా కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఐసీఎం డైరెక్టర్ డాక్టర్ గణేశన్, జీవన్‌కుమార్, దివాకర్ పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



సుమలత (ఫైల్)

శంషాబాద్: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎయిర్‌పోర్టు కాలనీలో నివాసముండే సాయికుమార్, సుమలత(31)లకు పదకొండేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాలుగైదు రోజులుగా సుమలత కడుపు నొప్పితో బాధపడుతోంది. బుధవారం తెల్లవారు జామున మంచినీటి కోసం భర్త నిద్రలేపితే లేవకపోవడంతో గుండెపోటుతో మృతిచెందినట్లు భావించారు. అంత్యక్రియల కోసం అంతా సిద్ధం చేసిన సమయంలో సుమలత కుటుంబ సభ్యులు ఆమె మెడ, బుగ్గలు తదతర చోట్ల కమిలిపోయిన చిన్న చిన్న గాయాలను గుర్తించారు. సాయికుమార్ తమ కుమార్తెను తీవ్రంగా కొట్టిన కారణంగానే చనిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద స్థితితో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రకృతి వనాల నిర్వహణ అస్తవ్యస్తం

- పిచ్చిమొక్కలతో నిండిన అంతర్గత రోడ్లు
- అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



శంకరాపురం బృహత్ పల్లె ప్రకృతి వనంలో బెంచీల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

శంషాబాద్ రూరల్: పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన ప్రకృతి వనాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. అందమైన ప్రకృతి నడుమ సేదతీరేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు కాస్తా మందు బాబులకు వరంగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనాల నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి.

- మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు.
- ప్రకృతి వనాలను కనీసం అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. వీటిలో విరివిగా మొక్కలు నాటారు.
- పండ్లు, పలు రకాల పూల జాతి మొక్కలతో పాటు ఔషధ మొక్కలను పెంచారు. పక్షులకు ఆవాసాలతో పాటు గ్రామస్తులకు పచ్చదనం... ఆహ్లాదాన్ని పంచేలా వీటిని తీర్చిదిద్దారు. వనం చుట్టూ రోడ్డు ఏర్పాటు చేసి మధ్యలో మొక్కలను నాటారు.
- ప్రకృతి వనాల్లో ఉన్న రోడ్లు మొత్తం పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోయాయి. వనాల్లో తిరిగేందుకు ఏర్పాటు చేసిన రోడ్లపై నడవడానికి వీలులేకుండా పోయాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులు వనాల్లో వాకింగ్ కోసం వెళ్లేందుకు భయపడుతున్నారు. వర్షాలతో రోడ్లపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.
- పల్లె ప్రకృతి వనాలకు గేట్లు ఏర్పాటు చేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. వనాల్లో ఉన్న బెంచీల్లో కూర్చుని మందుబాబులు దర్జాగా పార్టీలు చేసుకుంటున్నారు. మందు సీసాలను వనాల్లోనే పారేసి వెళ్తున్నారు.

బృహత్ పల్లె వనంలో...

మండలానికి ఒకటి చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని శంకరాపురం పంచాయతీ పరిధిలో సుమారు 8 ఎకరాల్లో దీన్ని విస్తరించారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. అయితే కొన్నాళ్లుగా వనం నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో అక్కడ రాత్రి, పగలు అనే తేడా లేకుండా మందు పార్టీలు సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు వనాల నిర్వహణ చేపట్టి పచ్చదనం పెంపుతో పాటు రోజూ వాకింగ్ చేసేలా వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పెద్దషాపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో రోడ్డుపై పెరిగిన పిచ్చిమొక్కలు



ప్రకృతి వనంలో మద్యం సీసాలు

ఎయిర్‌పోర్టులో హైజాక్ మాక్ డ్రిల్

శంషాబాద్: విమానాన్ని హైజాక్ చేస్తే ఎదురయ్యే విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో వివిధ విభాగాలకు చెందిన ఎయిర్‌పోర్టు ఉద్యోగులు, వివిధ భద్రతా విభాగాలకు చెందిన అధికారులు, సైబరాబాద్ పోలీసులు, అగ్నిమాపక, వైద్యవిభాగం అధికారులు పాల్గొన్నారు. హైజాక్ జరిగిన సమయంలో వ్యవహరించాల్సిన విధానాలను యథాతథంగా నిర్వహించారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఈ మాక్‌డ్రిల్‌ను పరిశీలించారు. ఎయిరోడ్రోమ్ సమావేశంలో కూడా ఆయన పాల్గొన్నారు.

8న 'టెడెక్స్' హైదరాబాద్ సమావేశం

గచ్చిబౌలి: టెడెక్స్ 10వ ఎడిషన్ సమావేశాలను సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ ఎండీవర్ (ఎస్‌ఏహెచ్‌ఈ) ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహిస్తారు. ఈ సమావేశాలలో ప్రసంగించేందుకు 14 మంది ప్రముఖులను ఎంపిక చేశారు. అత్యధిక ప్రయాణాలు చేసిన వ్యక్తి రవిప్రభు, ట్యాంక్‌బండ్‌లో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన అనేకమంది ప్రాణాలను రక్షించిన ట్యాంక్‌బండ్ శివ, నిర్మాతనాగ్ అశ్విన్, ప్రఖ్యాత ఏరోస్పేస్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రహ్లాద రామారావు, వివిధ రంగాలలో ప్రముఖులైన ఎన్‌డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమాసుధీర్, ప్రముఖ ఆర్కియాలజిస్ట్, చరిత్రకారుడు డాక్టర్ శివనాగిరెడ్డి, మయూర్ పట్నాల, చెఫ్ సంజయ్‌తుమ్మా, అజీజ్‌నాజర్, మస్త్ అలీ, అయోధ్యరామిరెడ్డి, రుబీనా నఫీస్, ఫాతిమా, డాక్టర్ శివ, కవితా పాలంచ, శిఖాగోయల్ వంటి ప్రముఖులు ప్రసంగిస్తారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఆపాలి

గోల్కొండ: బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపి వేయాలని బీజేవైఎం నగర కార్యదర్శి జొన్నకుంటి మధుసూదన్ డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి వారు ఇందిరాపార్కు వద్ద బుధవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కార్వాన్ నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

జాంబాగ్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో..

సుల్తాన్‌బజార్: బంగ్లాదేశ్‌లో హిందూవులపై దాడులకు నిరసనగా జాంబాగ్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో కోఠి చౌరస్తాలో బంగ్లాదేశ్ కేర్ టేకర్ ప్రెసిడెంట్ మహ్మద్ యూనస్ చిత్రపటాన్ని బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూవులపై జరుగుతున్న దారుణ మారణకాండపై కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్

- ఇబ్బందులు పడుతున్న వాహనాదారులు
- ప్రమదాలబారిన పాదచారులు
- అరికట్టడంలో సంబంధిత యంత్రాంగం విఫలం



హైదర్‌గూడలో ఇసుక, కంకర లోడ్‌లతో పార్కు చేసిన లారీలు

అత్తాపూర్: అత్తాపూర్‌లోని పి.వి.నర్సింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారస్తులు ఎక్కడ పడితే అక్కడ లారీలు, వాహనాలను పార్కింగ్ చేస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. గృహ నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, ఇటుక, కంకర, గ్రానైట్ రాయి తదితర వస్తువులను క్వారీల నుంచి స్థానికంగా డంప్ చేసి విక్రయించే వారు. కొందరైతే క్వారీల నుంచి తీసుకొచ్చి నేరుగా వినియోగదారుడికి చేరవేస్తూ హైదర్‌గూడ, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి వరకు ట్రక్కులు, లారీలను పార్కింగ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవలి కాలంలో రాజేంద్రనగర్ ఆర్డీవో ప్రధాన కార్యాలయం వద్ద పిల్లర్ నెంబర్ 162 ప్రాంతంలో వాహనదారులు అక్రమంగా డంప్ చేస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వాహనాలను అడ్డం పెట్టుకొని కొంత మంది స్వార్థపరులు కోట్లాది రూపాయల విలువ కలిగిన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉండే జీఎస్టీ సమీపంలో ఉన్న విలువైన స్థలాలను గుట్టు చప్పుడు కాకుండా చదును చేసుకుంటున్నారు. ఇలాంటి వారిపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు 'నేషనల్ అచీవ్‌మెంట్' టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం పరాక్ నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్ష నిర్వహించారు. పాల్మాకులలోని మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల, నర్కూడలోని జిల్లా పరిషత్, చిన్నగొల్లపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని 3, 6, 9వ తరగతుల విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. భారత విద్యా శాఖ, ఎన్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నమూనా-ఆధారిత విద్యా సర్వేలో భాగంగా పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు చదువుతో పాటు అభ్యాసన, అభివృద్ధిని ప్రభావితం చేసే సామాజిక భావోద్వేగ సందర్భోచిత కారకాలను అంచనా వేయడం, పాఠశాల విద్యా వ్యవస్థ నాణ్యత, ప్రభావాన్ని కచ్చితమైన అంచనా కోసం ఈ పరీక్ష చేపట్టినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, రేష్మ, మహేశ్వరి, శ్రీలత, కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు అన్ని వర్గాల ఆదరణ



సీనియర్ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తున్నదని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్‌కాలనీలోని తన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో బుధవారం సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతంలోని సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా పని చేయని ఏరియా కమిటీ ప్రతినిధులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలోని నానల్‌నగర్, టోలిచౌకీ, లంగర్‌హౌజ్, గోల్కొండ డివిజన్లలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు నిత్యం పరిశీలిస్తూ వాటి పురోగతిని తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో నేతలు హరూన్‌ఫరాన్, అమీర్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: ప్రజా పాలన విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర బుధవారం అందుకు సంబంధించిన పనులను పరిశీలించారు. 7వ డివిజన్‌లోని వ్యాలీ వ్యూ ఎంక్లేవ్, 10వ డివిజన్‌లోని బాబమ్మ కాలనీ, 18వ డివిజన్‌లోని అభ్యుదయనగర్ కాలనీలలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టి కుప్పలు, వ్యర్థాలను జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్, నాయకుడు సురేష్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



శంషాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ పి.సంజయ్‌యాదవ్ మాట్లాడుతూ... విద్యాభివృద్ధికి రాష్ట్ర సర్కార్ పెద్ద పీట వేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నిర్వీర్యంగా మారిన వర్సిటీలకు వీసీల నియామకంతో దారిలో పడ్డాయన్నారు. సంక్షేమ, గురుకుల హాస్టళ్ల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రక్రియ కూడా ఏడాదిలోనే జరిగిందన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా సర్కారు చొరవ చూపుతోందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు రంజిత్, మణికంఠ, అభిషేక్, జగదీష్, మనోహర్ యాదవ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద బుధవారం హెల్ప్ ఆన్ వీల్స్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్ప్ ఆన్ వీల్స్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు బండ్లగూడం ప్రసాద్ కవిత, బబ్లూ, ఎ.మహేందర్, కోరని కుమార్, బండ్లగూడెం నరేందర్, గుంటి ప్రశాంత్, గుంటి సురేశ్ మాదిగ, జి.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి అభివృద్ధికి రూ.1,606 కోట్లు

- హెచ్-సిటీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- మూడు ఫ్లైఓవర్లు, రోడ్డు విస్తరణ, 6లేన్ బై డైరెక్షనల్ ఫ్లైఓవర్, అండర్ పాస్‌లు
- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రైజింగ్ ఉత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి నగరంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంపై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హర్షం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో రూ. 1,606 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. శేరిలింగంపల్లిలోని ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్‌ఐటీ జంక్షన్, విప్రో జంక్షన్‌లలో మల్టీలెవల్ ఫ్లైఓవర్/గ్రేడ్ సరేటర్స్ 3 జంక్షన్లలో రూ. 837 కోట్లతో పనులు చేపడతారు. రూ. 39 కోట్లతో గచ్చిబౌలిలోని సీపీ సైబరాబాద్ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు 215 అడుగుల రోడ్డు విస్తరణ, పనులు చేపట్టనున్నారు. రూ. 31 కోట్లతో అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్ వరకు 150 అడుగుల మేర రోడ్డు విస్తరణ అలాగే రూ. 45 కోట్లతో ఎన్‌హెచ్-65 నుంచి అమీన్‌పూర్ వరకు 150/100 అడుగు రోడ్డు విస్తరణ జరుగుతుందన్నారు. రూ. 530 కోట్లతో మియాపూర్ చౌరస్తా-ఆల్విన్ చౌరస్తా వరకు ఆరు లైన్ల బై డైరెక్షన్ ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వరకు మూడులేన్ల యూనిడైరెక్షనల్ అండర్‌పాస్ నిర్మాణం చేస్తారని ఆయన వివరించారు. కాగా రూ. 124 కోట్లతో శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

కాలనీ అభివృద్ధికి సహకరించండి

శేరిలింగంపల్లి: గుల్‌మోహర్‌పార్కు కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బుధవారం ఆయన నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో ఉత్తమ పార్కు అవార్డు సాధించిన గుల్‌మోహర్ పార్కు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీంను ఎమ్మెల్యే సన్మానించి, అసోసియేషన్ నాయకులను అభినందించారు.